
# తల్లి మనసు



మధ్య తరగతి వాళ్ళకి పిల్లలకు బడులు తెరవడం పెద్ద గండమనే చెప్పాలి. ఫీజులు కట్టాలి. పుస్తకాలు కొనాలి. పాడైతే బూట్లు కొనాలి. యూనిఫాంలు కుట్టించాలి.

తప్పని ఖర్చులు....

పిల్లల పట్ల పెద్దల బాధ్యతలు....

ఎలా ఈ గండం నుండి బయట పడాలోనని అందరిలాగే ప్రభాకరమూ ఆలోచిస్తున్నాడు. పైగా క్రితం నెల భార్య అనారోగ్యం వల్ల లోటు బడ్జెట్. జీత మొచ్చిన మర్నాడే జేబులు ఖాళీ అయ్యే సగటు జీవితానికి పిల్లల చదువు పెద్ద సమస్యే మరి.

"ఏమిటి ఆలోచిస్తున్నారు? పిల్లల ఫీజుల

మసునూరి పేరయ్యశాస్త్రి

గురించేనా?" భర్తకి టీ కప్పు అందించి ఎదురుగా కూర్చుంటు అడిగింది ప్రభాకరం భార్య పద్మ.

అవు నన్నట్టు తలాడించాడతను. పద్మ భర్త వైపు జాలిగా చూసింది. అప్పుడప్పుడు భర్తకు తెలియకుండా తీసి దాచుకున్న డబ్బులు సైతం ఇంటి పులుసులోనే పడిపోతుంది. తనేమివ్వ గలదు?

ఒక మాట చెప్పనా! "ఏదో స్ఫురించినట్టు హఠాత్తుగా అంది పద్మ.

"ఏమిటి?"

"మొన్నా మధ్య మీ అమ్మగారిని అయిదొందలు అడిగి తీసుకొని- మళ్ళీ యిచ్చేశారుగా. మళ్ళీ అడగండి" అంది.

"పాపం, ఆవిడకున్న ఆస్తే ఆ అయిదు వందలు. అస్తమానూ...."

"ఊరికే అడగటం లేదు కదండీ! రెండు నెలల్లో యిచ్చేద్దురు గానీ!"

ప్రభాకరం ఆలోచించాడు. ఈ పరిస్థితుల్లో బయట అప్పు దొరకడం కూడా కష్టమే? భార్య చెప్పినట్టు చేసేస్తే. ప్రస్తుతం ఈ గండం నుండి బయటపడవచ్చునని పించింది.

"అమ్మా!" పిలిచాడు.


తల్లి కామాక్షి వచ్చింది. "ఏమిట్రా" అంటూ.

"అమ్మ, ప్రస్తుతం పిల్లలకి ఫీజులు కట్టాలి. ఆ మధ్య అయిదొందలు సర్దావుగా! ఆ డబ్బు మళ్ళీ యిచ్చావంటే- రెండు నెలల్లో తిరిగి యిచ్చేస్తాను" అని కొడుకు అన్నాడో లేదో- ఆమె కంగారు పడి పోయింది.

"నా దగ్గరా.... ఒక్క పైసా లేదు. అప్పుడేదో వుంది కాబట్టి సర్దాను గానీ-ఇప్పుడు నా దగ్గర పైసా లేదు నాయనా!" అంది.

ప్రభాకరం ముఖం చిన్న బోయింది. పద్మ అత్తగారి వైపు గుర్రుగా చూసింది.

ఆ తర్వాత పద్మ, "అది కాదండత్తయ్య గారూ! ఖర్చులో వున్నారు కాబట్టి అడిగారు. రెండు



నెలల్లో తప్పక ఇచ్చేస్తారు." మీ దగ్గర మాత్రం పెట్టెలో పడుండాల్సిందేగా!" అంది.

అంతే. వెంటనే కామాక్షి లేచి తన గదిలోంచి పెట్టె తీసుకు వచ్చింది కోడలు ముందు పెట్టింది. అందులో బట్టలన్నీ తీసి దులిపింది. దాంట్లో డబ్బులు లేవు.

ప్రభాకరం తెల్ల బోయాడు. పద్మ ముఖం తిప్పుకొంది. కామాక్షి బట్టలు సర్దుకొని పెట్టెతో తన గదిలోకి వెళ్ళి పోయింది.

ఆఁ... అయినా ఆవిడ ఇది వరకటి మనిషిగాదు. చాలా మారిపోయారు. బహుశ ఆ డబ్బు మీ చెల్లెలికిచ్చి వుంటారు అయినా ఆ డబ్బులు మాత్రం అప్పుడప్పుడూ మీరుంచుకోమని యిచ్చిన డబ్బులేగా!" నిష్ఠూరంగా అంది.

"పద్మా, ఆవిడ నేమీ అనకు!" అని భార్య మీద చిరాకు పడ్డాడేగానీ, తల్లి ప్రవర్తన అతనికెక్కడా నచ్చలేదు. ఒకరు యివ్వనంత మాత్రాన పనులు ఆగిపోవు గదా! వేరే ప్రయత్నం చేశాడు. పిల్లల ఫీజులు కట్టాడు.

రోజులు గడుస్తున్నాయి.

అనుకోకుండా ఒక రోజు కామాక్షికి అనారోగ్యం చేసింది. వెంటనే హాస్పటల్లో చేర్పవలసి వచ్చింది. డాక్టర్ ఫీజులు.... మందులు జేబులో వున్న డబ్బు ఖర్చు పెట్టాడు. ఆమె పరిస్థితి మరింత క్షీణించిం దన్నారు డాక్టర్లు. ఖరీదైన మందులు వ్రాసిచ్చాడు అప్పుకోసం నానా తంటాలు పడ్డాడు గానీ- ఎక్కడా.

ఒక్క పైసా దొరకలేదు. ఒకే ఒక ఆశ. తల్లి దగ్గరకు వచ్చాడు.

"అమ్మా!" పిలిచాడు.

ఆమె కొడుకును చూసింది కళ్ళు తెరచి తల్లి నడగాలంటే గుండె కోస్తున్నంత బాధ.... అయినా తప్పని పరిస్థితి...

"నీ దగ్గరున్న ఆయిదు వందలూ ఎక్కడ పెట్టావమ్మా?" చాలా అవసరం. మళ్ళీ యిచ్చేస్తాను" అన్నాడు కంట తడితో.

అంత అనారోగ్యం తోనూ, ఆ మాటలు విని ఆమె కంగారు పడింది. తల తిప్పేసుకొని, "నా దగ్గర లేవని చెప్పాను కదరా!" అంది నెమ్మదిగా.

లాభం లేదనుకున్నాడు బయట కొచ్చాడు. మందుల షాపు వాడి కాళ్ళా వేళ్ళా పడి మంధులు తీసుకున్నాడు. హాస్పటల్‌కు వచ్చాడు.

కానీ,

డాక్టర్ ఎదురై "సారీ ప్రభాకరం, ఆమెకు ఇవే చివరి ఘడియలు. ఇంటికి

## తల్లి మనసు

తీసుకు వెళ్ళండి" అన్నాడు.

ప్రభాకరం నిర్ఘాంత పోయాడు. తల్లి దగ్గరకు వచ్చాడు. ఆమె డొక్కలు ఎగరేస్తోంది. ఆమె పిలిచినా పలకడం లేదు. కనీసం చూడటం లేదు. పద్మ, పిల్లలు మంచం అంచున కూర్చుని ఏడుస్తున్నారు.

ప్రభాకరం కొడుకును పిలచి, "బాబూ! ఈ మందులు షాప్‌లో ఇచ్చేసిరా" అని పంపాడు. తన స్నేహితులకు కబురు పంపాడు. వారు రాగానే తల్లిని ఇంటికి చేర్చాడు. బంధువులకి తెలియ పరచాడు. చెల్లెలి దగ్గరకు మనిషిని పంపించాడు తెల్లవారు జామున రెండు గంటల ప్రాంతంలో కామాక్షి తుది శ్వాస విడిచింది.

తెలవారింది. కామాక్షి మరణ వార్త ఊరంతా వ్యాపించింది.

ప్రభాకరం ఒక మూల ఏడుస్తూ కూర్చున్నాడు.

"ఎందుకు ఆలశ్యం! అంతిమ యాత్రకు సిద్ధం చెయ్యండి" ఎవరో పెద్ద మనిషి అరిచాడు.

ప్రభాకరం జేబులు తడుము కున్నాడు.పైసా లేదు. ఈ పరిస్థితిలో కూడా అప్పు చేయవలసి వచ్చిన తన దౌర్భాగ్యపు పరిస్థితికి తనపై తనకే కోపం.

ఇంతలో –

"ప్రభాకరం మీ అమ్మగారు పోయారటగదా! ధైర్యంగా వుండు. నిన్న ఏదో పనుండి విజయవాద వెళ్ళి- ఉదయం వచ్చేసరికి ఈ వార్త." బాధగా అన్నాడు ప్రక్కింటి రమణయ్యగారు.

రమణయ్య గారంటే కామాక్షికి ఎంతో అభిమానం. అన్నయ్యా! అన్నయ్యా! అని పిలిచేది. అదే చెప్పి ఆయన బాధపడ్డాడు.

ఆయనే మళ్ళీ అన్నాడు.

చూడు నాయనా! ఇంకా ఆలస్యం దేనికీ. ఇదిగో ఈ అయిదు వందలు తీసుకో! ఈ అయిదు వందలు నేనిస్తున్నవి గాదు. ఎప్పుడో మీ అమ్మే వుంచమని ఇచ్చింది. నా అంత్య క్రియల సమయంలో అయ్యో, తల్లి పోయిందనే వాడు బాధ పడాలి గానీ- ఎలా ఈ గండం నుండి బయట పడాలని నా కొడుకు బెంగ పడకూడదని ఈ డబ్బు ఇచ్చింది. పైగా- ఈ విషయం ఎవరికీ చెప్పొద్దని ప్రమాణం కూడా వేయించుకొంది నాయనా!" అని అయిదు వందల కాగితాన్ని అతని చేతిలో పెట్టారు రమణయ్య.

ఆ కాగితాల్ని చూసి బావురు మన్నాడు ప్రభాకరం. తల్లి శవంపై పడి చిన్న పిల్లాడిలా ఏడుస్తూ "అమ్మా! నన్ను క్షమించు- నన్ను క్షమించమ్మా" అని అంటున్నాడు. అతని కడుపులోని బాధ కన్నీటిగా కరగి బయటకు రావడమే మంచిదన్నట్టుగా అందరూ చూస్తూ నిలబడ్డారు. అంతిమ యాత్రకు ఏర్పాట్లు జరుగుతూనే వున్నాయి. కాలం కరుగుతూనే వుంది. అతనేడుస్తూనే వున్నాడు.

○

## ఓజోన్ పొరవల్ల మొక్కలకి నష్టం

గంధక ద్విఆమ్ల జనితము (సల్ఫర్ డై ఆక్సైడ్), నత్రజని, ఓజోన్‌లు కలిసి మొక్కల పెరుగుదలపై (మనిషిపై కూడా) అననుకూల ప్రభావాన్ని నెరపుతాయని మాస్కో ప్రకృతి పరిసర- జలవాతావరణ పరిశోధనాలయ శాస్త్ర వేత్తలు కంప్యూటర్ సాయంతో కనుగొన్నారు. నత్రజని ద్విఆమ్ల జనితము అతి తక్కువ హానికరంకాగా, గంధక ద్విఆమ్ల జనితము అంతకంటె ఎక్కువ హానికరమని ఓజోన్, అన్నిటికన్నా చెడ్డదని యూ అధ్యయనాలలో వెల్లడయింది అల్ట్రావైలెట్ సూర్య వికిరణ పాటువల్ల గాలిలో ఓజోన్ శాతం పెరగడంతో కిరణజన్య సంయోగక్రియ తీవ్రత బాగా తగ్గి పోతుందని శాస్త్ర వేత్తలు చెబుతున్నారు సూర్య వికిరణాన్ని కవచంలా అడ్డుకుని భూతలాన్ని కాపాడే కర్తవ్యాన్ని ఓజోన్ పొర నిర్వర్తిస్తున్నది. అయితే వాతావరణ మందలి ఓజోన్ పొర మరీ మందమై కిరణజన్య సంయోగ ప్రక్రియకు అత్యావశ్యకమైన సూర్యకిరణ ప్రసారాన్ని అతిగా అడ్డుకొనడం వల్ల జరిగే నష్టం మరింత ఎక్కువగా ఉంటుంది